క్లుప్తంగా

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్ల పరిశీలన



జేఎన్టీయూకేలో స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ సెంటర్ల వద్ద సూచనలిస్తున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ: కాకినాడ, తుని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు జె.వెంకటరావు, కె.రామలక్ష్మి గురువారం స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధించి జేఎన్టీయూకే సివిల్ బ్లాక్‌లో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్లను కేటాయించారు. పలువురు ఎన్నికల అధికారులు, ఇతర సిబ్బందితో కలిసి అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందీ లేకుండా విధులు నిర్వహించేలా తీసుకోవలసిన చర్యలపై అధికారులకు సూచనలిచ్చారు. వీరి వెంట తహసీల్దార్ దొర, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు సీతాపతిరావు, నాయుడు, సర్వేయర్ ఆచార్యులు, ఏఈ రమేష్ ఇతర ఉద్యోగులు ఉన్నారు.

19 నుంచి వేంకటేశ్వర కల్యాణోత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక మెహర్‌నగర్‌లో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 19 నుంచి 31న వరకూ అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 19న విష్వక్సేన పూజ, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, 20న రాత్రి 7 గంటలకు దివ్య కల్యాణ మహోత్సవం, 21న భజన, 22న లక్ష తులసీపూజ, రాత్రి సదస్యం, అనంతరం ఘంటసాల సంగీత విభావరి, 23 భక్తి సంగీత విభావరి, 24న పూర్ణాహుతి, రాత్రి శ్రీపుష్పయాగం, 25న భక్తి సంకీర్తనగానం, 26న శివ పార్వతుల కల్యాణం బుర్రకథ, 27న సినీ భక్తి సంగీత విభావరి, 28న మెహర్‌సాయి ఆరాధన, 29న భక్తి సంగీత విభావరి, 30న కోల సంబరం, 31న అన్నదాన కార్యక్రమం జరుగుతాయని ఆలయ ధర్మకర్తలు మల్లిపూడి వెంకటేష్, మల్లిపూడి చత్రపతి శివాజీ గణేష్ గురువారం విలేకర్లకు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత్వం



గౌరీ శంకర్‌కు నిత్యావసర వస్తువులు అందిస్తున్న దూసర్లపూడి రమణరాజు

బోట్‌క్లబ్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే మానవత్వమని సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు అన్నారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. స్థానిక గొల్లపేటలో గుండెపోటుతో తీవ్ర అనారోగ్యానికి గురై రెండు నెలల నుంచి ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్ గౌరీ శంకర్ కుటుంబానికి వివేకా అభ్యుదయ సేవా సమితి బియ్యం, నిత్యావసర కిరాణా సరుకులు గురువారం అందజేశారు. వారి పిల్లలను చదువుకు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. సమితి అధ్యక్షుడు పెంకె నూకరాజు సభ్యులు ఊసా నూకరాజు, పి.లోవరాజు, చెల్లి సుబ్బారావు, ఖండవిల్లి బుజ్జి పాల్గొన్నారు.

తమ్మవరంలో యోగా శిక్షణ



యోగాసనాలు వేస్తున్న సాధకులు

కాకినాడ రూరల్: మండలంలోని తమ్మవరం గ్రామంలో నన్నయ ఎంఎస్ఎన్ క్యాంపస్‌కు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్-1 వలంటీర్ల శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులు, యువకులకు యోగాలో శిక్షణ అందించారు. యోగా శిక్షకుడు కాంతారావు వివిధ ఆసనాలను సాధన చేయించారు. ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీదేవి, మాజీ సర్పంచ్ కాదా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రహదారి పనుల్లో పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

కాకినాడ రూరల్: వలసపాకలలో పారిశుధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి. మూడు రోజులుగా సాగుతున్న ఈ పనుల్లో గురువారం జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ పాల్గొని సిబ్బందిని ఉత్సాహపరిచారు. గ్రామంలో ఇంటింటికీ డస్ట్‌బిన్లను పంపిణీ చేశారు. ఇళ్లలోని చెత్తను వీధుల్లో వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందజేసి సహకరించాలన్నారు.

ఉపాధి పనులు ప్రారంభించాలి

కాకినాడ సిటీ: ఏప్రిల్ 1 నుంచి ఉపాధి పనులు ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, కార్మిక సంఘం డిమాండ్ చేసింది. గురువారం సుందరయ్య భవన్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ఏప్రిల్ 1 నుంచైనా మొత్తం అందరికీ ఉపాధి హామీ పనులు చెప్పాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి ఈశ్వరరావు, కేఎస్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

మహిళలకు అండగా.. చేయూత తోడుగా..

- వైఎస్సార్ చేయూత పథకంతో దన్ను
- ఏటా రూ.18,750 ఆర్థిక సాయం
- నిధులు నేరుగా వారి ఖాతాల్లో జమ
- కాకినాడలో నాలుగో విడతలో 13,419 మందికి లబ్ధి
- లబ్ధిదారుల ఖాతాల్లో రూ.25.16 కోట్లు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

బోట్‌క్లబ్: మహిళల ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత పథకంతో ప్రోత్సహిస్తున్నారు. ప్రజా సంకల్పయాత్రలో మహిళల ఆర్థిక ఇబ్బందులకు చలించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే మహిళలకు చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18,750 అందిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ఈ పథకానికి రూపకల్పన చేసి, 45 నుంచి 60 ఏళ్లున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలకు ఈ పథకం ద్వారా లబ్ధి అందజేస్తున్నారు. గత నాలుగేళ్లలో నాలుగు విడతలుగా లబ్ధిదారులు రూ.75 వేల ఆర్థిక సాయాన్ని అందుకున్నారు. కుటుంబం బాగుపడాలంటే, మహిళలకు ఆర్థిక స్వావలంబన అవసరమని గుర్తించి, ప్రభుత్వం ఈ పథకం ద్వారా ఆర్థిక సాయాన్ని అందిస్తోంది.

టీడీపీ హయాంలో మొండిచేయి

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మహిళా సంక్షేమం అటకెక్కింది. చంద్రబాబు అధికారంలో ఉండగా, ఒక్కసారి కూడా మహిళల ఖాతాల్లో నగదు జమ అయిన దాఖలాలు లేవు. 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని, ఎవరూ బ్యాంకు రుణాలు చెల్లించవద్దంటూ చంద్రబాబు పెద్దఎత్తున ప్రచారం చేశారు. అధికారం వచ్చాక.. ఆ మాటను అసలు పట్టించుకోకపోవడంతో మహిళలు బయట అధిక వడ్డీకి అప్పులు చేసి, రుణాలు చెల్లించినట్టు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో ఉండగా ఎప్పుడూ పట్టించుకోని చంద్రబాబు ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుడడంతో కొత్త వాగ్దానాలకు తెరలేపారు. ఆయన హామీలకు ఓసారి మోసపోయిన మహిళలు.. తాజా వాగ్దానాలను అస్సలు పట్టించుకోవడం లేదు.

వైఎస్సార్ సీపీ పాలనలో..

మహిళలు ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు.

వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు, వైఎస్సార్ సున్నా వడ్డీ వంటి పథకాలతో మహిళలకు కోట్లాది రూపాయలు ఆర్థిక తోడ్పాటు అందించారు. కాకినాడ నగరంలో వరుసగా నాలుగో ఏడాది కూడా వైఎస్సార్ చేయూత పథకం కింద 13,419 మందికి రూ.25.16 కోట్ల మేర లబ్ధి చేకూరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 8వ తేదీన చేయూత పథకాన్ని ప్రారంభించడంతో లబ్ధిదారులకు వారి ఖాతాల్లో నగదు జమయింది. దీంతో మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

జగన్ మేలు ఎన్నటికీ మరువలేం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నా కుటుంబానికి చేసిన మేలు ఎన్నటికీ మరువలేను. గత నాలులేళ్లుగా రూ.75 వేలు నా ఖాతాలో జమయింది. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం మహిళల కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాను.

– సుందరపల్లి వెంకటలక్ష్మి, చేయూత లబ్ధిదారు

చంద్రబాబు మోసం చేశాడు



ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు దొంగ హామీలిచ్చి మహిళలను అన్ని విధాలా మోసం చేశారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండానే చేయూత నిధులు నా ఖాతాలో జమవుతున్నాయి. గత నాలుగేళ్లలో నాకు చేయూత పథకంలో రూ.75 వేలు జమయ్యాయి. గతంలో ఏ ముఖ్యమంత్రి మహిళల కోసం ఇన్ని పథకాలతో ఆదుకోలేదు.

– రాజాన వెంకట సత్యవతి, చేయూత లబ్ధిదారు

విద్యార్థులకు కెనరాబ్యాంక్ స్కాలర్‌షిప్



విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ మల్లేశ్వరరావు

కరప: పేదవర్గాల బాలికల విద్యను ప్రోత్సహించేందుకు కెనరాబ్యాంక్ విద్యాజ్యోతి పథకం ద్వారా ఆర్థికసాయం అందిస్తోందని ఆ బ్యాంక్ కాకినాడ దేవాలయం వీధి బ్రాంచ్ చీఫ్ మేనేజర్ వి.మల్లేశ్వరరావు తెలిపారు. స్థానిక నక్కా సూర్యనారాయణ మూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ముగ్గురు విద్యార్థినులకు విద్యాజ్యోతి స్కాలర్‌షిప్‌లను అందజేసి ఆయన మాట్లాడారు. విద్యార్థినులు జిల్లెల నిఖిత (10వ తరగతి)కు రూ.10 వేలు, దడాల అపరంజి (9వ తరగతి)కి రూ.5 వేలు, వజ్రపు శ్రీగాయత్రి (7వ తరగతి)కి రూ.2,500 వంతున చెక్‌లను మల్లేశ్వరరావు అందజేశారు. బ్యాంక్ అధికారి జి.బాలాజీ, ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.స్వర్ణ రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



సీతారామస్వామి ఆలయంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

బోట్‌క్లబ్: నగరంలో ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో గురువారం పలు అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఆలయం గాలిగోపురం, పెయింట్, భక్తులు నడిచేందుకు గ్రానైట్ వేసేందుకు రూ.70 లక్షల దేవాదాయశాఖ సీజీఎఫ్ నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి అభివృద్ధి పనులను ప్రారంభించారు. తొలుత సీతారామస్వామిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ మార్కెట్ కమిటీ చైర్మన్ పుసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఆలయ ఈఓ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ద్వారంపూడి



వైస్సార్ సీపీలో చేరిన గైగోలుపాడుకు చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలతో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ: స్థానిక 6వ డివిజన్ పరిధిలోని రేచర్లపేట ప్రాంతానికి చెందిన సుమారు 25 మంది జనసేన–టీడీపీలకు గుడ్‌బై చెప్పి గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. వార్డు కన్వీనర్ తెలుగు సుశీల, తెలుగు రామకృష్ణ ఆధ్వర్యంలో దొర్ల అంజిబాబు, రవ్వ శ్రీనివాస్, సామంతుల శంకరరావు, చీకట్ల విజయ, అదపాక అంజమ్మ, బతాని పద్మతో పాటు సుమారు 25 మంది పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వీరందరికీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మరో నెల రోజుల్లో ఎన్నికలు జరగనున్నందున పార్టీ విజయం కోసం కష్టించి పనిచేయాలని ఎమ్మెల్యే ద్వారంపూడి వారికి సూచించారు.

గైగోలుపాడువాసుల చేరిక

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట పంచాయతీ గైగోలుపాడుకు చెందిన పలువురు టీడీపీ, జనసేన కార్యకర్తలు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో గురువారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకురాలు మేడిశెట్టి లక్ష్మి, పిల్లి వరలక్ష్మి, మెగలి బేబీల ఆధ్వర్యంలో కొత్తగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కన్నబాబు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో గంజా భాస్కరరావు, అనుసూరి శ్రీనివాసు, బండారు అజయ్, తురాల తాతారావు, బోడపాటి వాసు తదితరులు ఉన్నారు.

పేదలకు వరం రిజిస్ట్రేషన్ పట్టాలు



పండూరు గ్రామంలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

- ఇచ్చిన హామీలు నెరవేర్చిన జగనన్న
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీలను పూర్తిగా నెరవేర్చి పేదల గుండెల్లో నిలిచారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం కింద జగనన్న కాలనీలో ఇచ్చిన ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లను ఉచితంగా చేసి అందించడం లబ్ధిదారులకు వరమన్నారు. మండలంలోని పండూరు, గంగనాపల్లి గ్రామాలలో గురువారం సాయంత్రం ఇళ్ల పట్టాలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను ఆయన పంపిణీ చేశారు. పండూరు గ్రామంలో ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఈబీసీ కాలనీలో పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నందిపాటి వెంకట శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు నందిపాటి ధర్మరాజు, తమ్మలపల్లి చంటి, నందిపాటి సత్తిబాబు, ఆదినారాయణ, రాంబాబు, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గంగనాపల్లి గ్రామంలో సర్పంచ్ గీసాల మహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పేదలకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ వాసంశెట్టి సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు 'మెప్మా' అండ

- ప్రాజెక్టు డైరెక్టర్ ప్రియంవద



వాటర్‌కూలర్‌ను ప్రారంభిస్తున్న మెప్మా పీడీ ప్రియంవద

కాకినాడ: కాకినాడ రామారావుపేటలో షెల్టర్ ఫర్ అర్బన్ హోంలెస్ కేంద్రంలో ఉంటున్న నిరాశ్రయులకు అన్ని విధాలా అండగా ఉంటామని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రియంవద పేర్కొన్నారు. గురువారం నిరాశ్రయుల వసతి కేంద్రంలో అక్కడి నిరాశ్రయుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ డిస్పెన్సర్‌ను ఆమె ప్రారంభించారు. అలాగే నగరపాలక సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కూడా ఆమె సందర్శించి మందులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెప్మా ఏఓ శివరామప్రసాద్, సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, మెప్మా సిబ్బంది, ఏఎస్‌ఎంలు పాల్గొన్నారు.

రూ.76.5 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: నియోజకవర్గంలోని లబ్ధిదారులు 69 మందికి మంజూరైన రూ.76.5 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గురువారం పంపిణీ చేశారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో ఈ చెక్కుల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ వివిధ వైద్య అవసరాలు నిమిత్తం మంజూరైన సీఎం సాయం ఆదుకుంటుందని, ముఖ్యమంత్రి జగన్ నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జేఎన్‌టీయూకే వీసీ సభ్యుడు బెజవాడ సత్యనారాయణ, రావూరి వెంకటేశ్వరరావు, ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా శ్రీకాంత్‌రెడ్డి

కాకినాడ సిటీ: జిల్లా ప్రొవిజన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా డి.శ్రీకాంత్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా విజయవాడ ఏపీఎస్‌బీసీఎల్ ప్రధాన కార్యాలయంలో డీజీఎంగా పని చేస్తున్న ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలిశారు.



కలెక్టర్ కృతికాశుక్లాను మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీకాంత్

గీతాంజలి మృతికి కారకులను శిక్షించాలి



ఇంద్రపాలెంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను ఆధ్వర్యంలో గీతాంజలి మృతికి కారకులను శిక్షించాలని కోరుతూ గురువారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గీసాల శ్రీను మాట్లాడుతూ టీడీపీ, జనసేన సోషల్ మీడియా ట్రోలింగ్ కారణంగానే గీతాంజలి మృతి చెందిందని, ఆమెకు న్యాయం జరిగేందుకు దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల శ్రీను, అనుసూరి ప్రభాకర్, సూరంపూడి మాధవ, చీమకుర్తి కిశోర్‌కుమార్, కుమారి, జ్యోతి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో వార్షికోత్సవ పూజలు

కరప: మండలం కొరిపల్లిలో శివాలయం 7వ వార్షికోత్సవ పూజలు గురువారం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ దేవిశెట్టి అప్పలరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పూజలను పర్యవేక్షించారు. ఆలయంలోని పార్వతీ, రామలింగేశ్వరస్వామి వార్ల కళ్యాణం నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.


పురాతన ఆలయాల పరిరక్షణకు చర్యలు

- ఎంపీ వంగా గీత
- పిఠాపురంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

పిఠాపురం: సంస్కృతీ సంప్రదాయాలకు నిలయాలుగా మారిన పురాతన ఆలయాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. దేవదాయ శాఖ సీజీఎఫ్ నిధులు రూ.1.10 కోట్లతో చేపట్టే పిఠాపురం నూకాలమ్మ గుడి వీధిలోని పురాతన సకలేశ్వరస్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యంలో గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.10 లక్షలు, ఎంపీ గ్రాంట్ రూ.15 లక్షలు, మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షలతో చేపట్టే రహదారుల నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, బొజ్జా దొరబాబు, బాలిపల్లి రాంబాబు, ముమ్మిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న కాలనీలు

- సొంతింటికల సాకారం చేసుకుంటున్న లబ్ధిదారులు
- మండల పరిధిలో 778 మందికి హౌసింగ్ రుణాలు



అరట్లకట్టలోని లే అవుట్‌లో జగనన్న కాలనీ

కరప: పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, సొంతింటి కల సాకారం చేయాలన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆశయం నెరవేరుతోంది. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాలతో మండల పరిధిలో గృహనిర్మాణాలు వేగవంతం చేసి లక్ష్యాలు పూర్తిచేసేందుకు అధికారులు లబ్ధిదారులను చైతన్య పరుస్తున్నారు. అరట్లకట్ట, జెడ్.భావారం, కరప, యండమూరు, గొర్రిపూడి గ్రామాల్లోని లేఅవుట్లలో 3,590 మందికి ఇళ్ల స్థలాల పట్టాలిచ్చారు. అరట్లకట్ట గ్రామంలో మూడు అవుట్లలో 380 మందికి, జెడ్.భావారంలో మూడు లేఅవుట్లలో 181 మందికి పట్టాలిచ్చారు. ఈ గ్రామాల్లో మొదటివిడతగా 393 మందికి గృహ రుణాలు మంజూరు చేశారు. మిగిలిన గ్రామాల్లో 2849 మందికి పట్టాలిచ్చారు. మొదటి విడతగా 778 మందికి గృహ రుణాలు మంజూరుచేశారు. కొంతకాలం పనులు మందకొడిగా సాగినా ఎమ్మెల్యే కన్నబాబు చైతన్య పరచడంతో పనులు ఊపందుకున్నాయి. వివిధ శాఖల సమన్వయంతో నాలుగోవంతు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకోగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

లబ్ధిదారుల్లో ఆనందోత్సాహాలు

లబ్ధిదారులకు ఆయా గ్రామాల్లో రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షలు విలువచేసే రెండు సెంట్ల స్థలాన్ని ఇచ్చారు. గృహ రుణం రూ.1.50 లక్షలు మంజూరు చేయించారు. వీటికి అదనంగా డ్వాక్రా మహిళలకు అదనంగా మరో రూ.50 వేలు బ్యాంకు రుణం మంజూరు చేస్తున్నారు. వీటికి తోడు దాచుకున్న కష్టార్జితంతో గృహనిర్మాణాలు చేపట్టారు.

లక్ష్య సాధనకు చర్యలు



778 మందికి రుణాలుమంజూరు చేశాం. పూర్తయిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నాం. మొదటి విడత లక్ష్యాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సొంత స్థలం ఉన్నవారికి 1096 మందికి రుణాలు మంజూరు చేయగా 959 ఇళ్లు పూర్తయ్యాయి.

– సుంకర రాంబాబు, హౌసింగ్ ఏఈఈ, కరప మండలం.

ఇల్లు కట్టుకుంటామనుకోలేదు



అంతంత మాత్రపు ఆదాయంతో ఇంటిస్థలం కొనుక్కుని, ఇల్లు కట్టుకుంటామని కలలో కూడా అనుకోలేదు. ఇంటి ఆడపడుచులా ఆదరించి ఇళ్లస్థలం పట్టా, రుణం ఇవ్వడంతో నిర్మాణం చేపట్టాం.

– ముత్యాల సత్యశివ, వెంకట్రావు దంపతులు, అరట్లకట్ట

సొంతిల్లు సమకూర్చుకున్నాం



గతంలో ఎన్నిసార్లు అడిగినా ఇంటి స్థలం ఇవ్వలేదు. ఎమ్మెల్యేగా కురసాల కన్నబాబు స్థలమిచ్చి, రుణం మంజూరు చేయడంతో సొంతిల్లు సమకూర్చుకున్నాం. ఎమ్మెల్యేను, సీఎం జగనన్నను ఎన్నటికీ మరువలేం.

– కోశెట్టి దేవి, జెడ్.భావారం